క్లుప్తంగా

పరామర్శ..



వరప్రసాదమ్మ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న చంద్రమోహన్, తదితరులు

బూర్జ: అల్లెన ఎంపీటీసీ వావిలపల్లి శ్రీరామ వరప్రసాదమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. మృతురాలి కుటుంబాన్ని తూర్పుకాపు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పిసిని చంద్రమోహన్ బుధవారం పరామర్శించారు. వరప్రసాదమ్మ చిత్రపటానికి నివాళులర్పించారు.

రొంపివలసలో ఫ్యామిలీ డాక్టర్



సూచనలిస్తున్న వైద్యుడు శ్రీధర్

పాతపట్నం: మండలంలోని రొంపివలస గ్రామంలో బుధవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యాక్రమాన్ని ఏర్పాటు చేశారు. బైదలాపురం పీహెచ్‌సీ వైద్యుడు ఐ.శ్రీధర్ రోగులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. గర్భిణులకు మహిళలకు, రోగులకు సుగర్, బీపీ పరీక్షలు నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, ఆశ వర్కర్లు, వలంటీర్లు పాల్గొన్నారు.

సాగునీటి కాలువను బాగుచేయాలి



వీఎన్‌పురం వద్ద పూడుకపోయిన 17ఎల్ పిల్ల కాలువ

సరుబుజ్జిలి: వంశధార కుడి ప్రధాన కాలువకు సుభద్రాపురం గ్రామం వద్ద అనుసంధానంగా నిర్మించిన 17ఎల్ పిల్ల కాలువ సక్రమంగా పనిచేయడం లేదు. సాగునీరు అందక ప్రతీ ఏటా రైతులు కష్టాలు ఎదుర్కొంటున్నారు. 300 ఎకరాలకు సాగునీటిని అందించాల్సిన 17ఎల్ పిల్ల కాలువ పూర్తిగా పూడుకపోయింది. గత పాలకుల హయంలో పనులు చేసినా, రైతులకు ఎటువంటి ప్రయోజం లేదు. దీనివల్ల సుమారు 9 కిలో మీటర్ల పొడవు గల ఈ కాలువ పిచ్చిమొక్కలు, పూడిక, చెట్లతో పూర్తిగా మూతపడింది. ఎగువ ప్రాంతం నుంచి సాగునీరు వచ్చినా శివారు భూములకు అందడం లేదు. ఖరీఫ్ సీజన్ నాటికి సాగునీటి ఇబ్బందులు లేకుండా చూడాలని రైతులు కోరుతున్నారు.

బోరు బాగు చేయాలని వినతి



మరమ్మతులకు గురైన బోరు

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్-1 పునరావాస కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో పాడైన బోరును బాగు చేయాలంటూ గ్రామస్తులు, కార్యకర్తలు కోరుతున్నారు. తిత్లీ తుఫాన్ సమయంలో మరమ్మతులకు గురైందన్నారు. కేంద్రానికి వస్తున్న చిన్నారులు, లబ్ధిదారులకు వంట చేసేందుకు మంచినీరు లేక ఇబ్బంది పడుతున్నామన్నారు. అధికారులు స్పందించి పాడైన బోరును బాగు చేయాలని కార్యకర్తలు కోరారు.

సేవాభావం అలవాటు చేసుకోవాలి



అంగీకార పత్రాలు అందజేస్తున్న హెచ్‌ఎం విశ్వేశ్వరరావు

జలుమూరు: విద్యార్థి దశ నుంచే సేవాభావం అలవాటు చేసుకోవాలని శ్రీముఖలింగం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం పి.విశ్వేశ్వరరావు అన్నారు. బుధవారం పాఠశాల ఆవరణలో జూనియర్ రెడ్ క్రాస్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. వారితో స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాలు చేసేందుకు అంగీకార పత్రాలు రాయించారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

గృహసారథుల సమావేశం రేపు

నరసన్నపేట: మండలంలోని 24 సచివాలయాల్లో ఇటీవల నియమించిన గృహసారథుల సమావేశం ఉర్లాం, నరసన్నపేట ఎస్‌ఏఆర్ కల్యాణ మండపాల్లో శుక్రవారం నిర్వహిస్తున్నట్లు సచివాలయ మండల కన్వీనర్ సురంగి నర్సింగరావు తెలిపారు. కోమర్తి, యారబాడు, ఉర్లాం, చిక్కాలవలస, తెలగవలస, చెన్నాపురం, లుకాలం, కామేశ్వరిపేట, చోడవరం, నడగాం సచివాలయాలకు సంబంధించిన గృహసారథుల సమావేశం ఉర్లాంలో ఉదయం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మిగిలిన 14 సచివాలయాల్లో ఉన్న గృహసారథుల సమావేశం నరసన్నపేటలోని ఎస్‌ఏఆర్ కల్యాణ మండపంలో సాయంత్రం 3 గంటలకు నిర్వహించనున్నట్లు చెప్పారు.

73 గ్రామాల్లో రెండో విడత భూ సర్వే

- రీ సర్వే వేగవంతానికి కృషి
- సర్వే ఇన్‌స్పెక్టర్ కె.రమేష్



సారవకోటలో భూ రీ సర్వేను పరిశీలిస్తునన సర్వే ఇన్‌స్పెక్టర్

సారవకోట: టెక్కలి డివిజన్ పరిధిలో 73 రెవెన్యూ గ్రామాల్లో రెండో విడత భూ సర్వే చేపడుతున్నట్లు సర్వే ఇన్‌స్పెక్టర్ కె.రమేష్ తెలిపారు. బుధవారం ఆయన మండలంలోని సారవకోట, ధర్మలక్ష్మీపురం సచివాలయాల పరిధిలో జరుగుతున్న రెండో విడత భూ సర్వేను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టెక్కలి డివిజన్ పరిధిలో రెండో విడత భూ సర్వేలో 56 గ్రామాల్లో ఇప్పటికే గ్రౌండ్ ట్రూతింగ్ పూర్తయిందన్నారు. అలాగే మొదటి విడతలో భూ సర్వే పూర్తయిన చోట్ల సర్వే రాళ్లు ఏర్పాటు చేయడం జరుగుతుందని, వీలైనంత త్వరగా సర్వే పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇప్పటికే పలు గ్రామాల్లో ఈ-పాస్ పుస్తకాల పంపిణీ చేశామన్నారు. ఎన్నో ఏళ్లుగా ఉన్న భూ సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. సర్వే సిబ్బందికి గ్రామాల్లోని రైతులు సహకరించాలన్నారు. సర్వే వేగవంతం చేయాలని సిబ్బందికి ఆదేశించారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సర్వే చేపట్టాలని సూచించారు. మండల సర్వేయర్ మహేశ్, వీఆర్వో గౌరమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

జాబ్‌కార్డు ఉన్న వారందరికీ ఉపాధి



మాట్లాడుతున్న ఏపీడీ రాధ

ఎల్.ఎన్.పేట: జాబ్ కార్డు కలిగి ఉన్న ప్రతీ కుటుంబానికి ఉపాధి హామీ పథకం పనులు కల్పించాలని ఆ పథకం హిరమండలం క్లస్టర్ ఏపీడీ పంచాది రాధ అన్నారు. మండల కేంద్రంలోని ఉపాధి హామీ పథకం కార్యాలయంలో బుధవారం సిబ్బందితో జరిగిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. పంచాయతీల వారీగా జరుగుతున్న పనులు వివరాలు, పనిలోకి వస్తున్న వేతనదారుల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. మరింత ఎక్కువ మంది పనిలోకి వచ్చేలా చేయాలన్నారు. కొలతల ప్రకారం ఉదయం, సాయంత్రం రోజుకు 6 గంటలకు తక్కువ లేకుండా వేతనదారులతో పనులు చేయించే బాధ్యత పీల్డ్ అసిస్టెంట్లపై ఉందన్నారు. ప్రతీ వేతనదారునికి రోజుకు రూ.250 వేతనం గిట్టుబాటు అయ్యేలా పని చేయించాలన్నారు. నిర్లక్ష్యంగా పని చేసే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఉపాధి పథకం ఏపీఓ వి.శ్రీదేవి పాల్గొన్నారు.

లక్ష్యాన్ని అధిగమించాలి

హిరమండలం: లక్ష్యాన్ని అధిగమించి ఉపాధి పనులు చేయించాలని ఏపీడీ పి.రాధ అన్నారు. బుధవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామల్లోనూ ఉపాధి పనులు జరిగేలా చూడాలన్నారు. ఉపాధి వేతనదారులను పెంచాలన్నారు. ప్రతీ వేతనదారునికి రూ.250 గిట్టుబాటు అయ్యేలా పనులు జరిపించాలన్నారు. కొలతల ప్రకారం పనులు చేసేలా చూడాలన్నారు. ఏపీఓ శ్రీనివాసరావు ఈసీ సంతోష్, టెక్నికల్ అసిస్టెంట్‌లు, క్షేత్ర సహాయకులు పాల్గొన్నారు.

18 నుంచి ఆలయ వార్షికోత్సవం

సారవకోట: మండల కేంద్రంలోని మండలాదీశ్వర స్వామి ఆలయ 60వ వార్షికోత్సవ మహోత్సవాలు ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ప్రతి ఏటా మహాశివ రాత్రి నుంచి మూడు రోజులపాటు ఈ ఆలయంలో ఉత్సవాలు నిర్వహిస్తారు. అంగూరు గ్రామంలోని కుంబేశ్వర స్వామి, నౌతళలోని స్వయంభూ రామలింగేశ్వర స్వామి ఆలయాలలో వార్షికోత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. భక్తుల దర్శనానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.

ఉమానీలకంఠేశ్వర స్వామి జాతర ప్రారంభం

కొత్తూరు: మహా శివరాత్రి సందర్భంగా మెట్టూరు బిట్-1 ఆర్ఆర్ కాలనీలో గల ఉమానీలకంఠేశ్వర స్వామి ఆలయం వద్ద ఈ నెల 18 నుంచి మూడు రోజులపాటు జాతర నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్మాణ కర్త బూర్లె శ్రీనివాసరావు బుధవారం తెలిపారు. మెట్టూరు బిట్-1, 2తోపాటు పరిసర గ్రామాలకు చెందిన ప్రజల సహకారంతో పలు ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పలు సాంస్కృతిక, వినోద కార్యక్రమాల ప్రదర్శన ఉంటుందన్నారు. ప్రత్యేక పూజలతోపాటు లింగాభరణం నిర్వహిస్తామన్నారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

బియ్యం ఇప్పించండి



డీలర్, గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఎస్‌డీటీ గణేష్

జలుమూరు: ఫిబ్రవరి నెల రేషన్ బియ్యం ఇప్పించాలని కరకవలస పంచాయతీకి చెందిన పలువురు లబ్ధిదారులు కోరారు. ఈ మేరకు బుధవారం గ్రామంలో నిరసన చేపట్టారు. ఈ విషయంపై జిల్లా కలక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గ్రామానికి సీఎస్‌డీటీ డి.గణేష్ వచ్చి విచారణ చేపట్టారు. ఫిబ్రవరికి సంబంధించి కరకవలసకు డిపోకు 118 క్వింటాళ్ల బియ్యం రావాల్సి ఉండగా.. కేవలం 58 క్వింటాళ్లు వచ్చాయన్నారు. దీంతోనే లబ్ధిదారులకు రేషన్ డీలర్ బియ్యాన్ని ఇవ్వలేకపోయారన్నారు. గొడౌన్ నుంచి వస్తున్న బియ్యంలో ప్రతి నెలా తక్కువగా రావడంతోనే అందించలేకపోతున్నానని డీలర్ కృష్ణారావు తెలిపారు. అధికారులు చొరవచూపి సమస్య పరిష్కరించాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు బొంగు గోవిందరావు, గ్రామస్తులు కోరుతున్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన



భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఈఓ మాధవరావు

జలుమూరు: జగనన్న గోరు ముద్ద పథకంలో భాగంగా మధ్యాహ్న భోజనం నిర్వహణలో నాణ్యత పాటించాలని ఎంఈఓ బి.మాధవరావు అన్నారు. బుధవారం గొటివాడ పంచాయతీ మహ్మద్‌పురంలోని ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ కచ్చితంగా అమలు చేయాలని, అలాగే శుచి, శుభ్రత పాటించాలన్నారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడారు.

కల్యాణం.. కమనీయం



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

నరసన్నపేట: స్థానిక పల్లిపేట కూడలిలో ఉన్న ఉమానీలకంఠేశ్వర స్వామి కల్యాణం బుధవారం రాత్రి భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు వసనాబి మల్లికార్జున స్వామి, కుమార్ స్వామి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఆమదాలవలస: స్థానిక 33/11 కేవీ సబ్‌స్టేషన్ పరిధిలో గల టౌన్ వన్ ఫీడర్ మరమ్మతు పనులు, చెట్ల కొమ్మలను గురువారం తొలగించనున్నారు. ఈ మేరకు విద్యుత్‌శాఖ ఈఈ ఎస్.బయ్యన్నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కె.మన్నయ్యపేట, టి.మన్నయ్యపేట, తురకపేట, చిట్టమ్మ రైస్ మిల్ ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తాన్నారు.

విద్యారంగంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ



ఉపాధ్యాయులకు సూచనలిస్తున్న వెంకటరెడ్డి

నరసన్నపేట: విద్యారంగంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని, ఈ దశలో విద్యార్థుల్లో అభ్యసన మెరుగుపరచాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైనే ఉందని లిప్ (లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రొగ్రాం) స్టేట్ టీమ్ సభ్యుడు వెంకటరెడ్డి అన్నారు. బుధవారం నరసన్నపేట మండలంలోని ఉర్లాం గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యా ప్రమాణాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల బోధనతో పాటు విద్యార్థులతో ప్రాక్టికల్స్ చేయించాలన్నారు. అప్పుడే విద్యార్థుల్లో ఆసక్తి పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు ఉపాధ్యాయులకు సూచనలు చేశారు. సబ్జెక్టు బోధనలో ఎప్పటికప్పుడు మార్పులు చేసుకోవాలన్నారు. ప్రధానంగా విద్యార్థులకు తప్పులు లేకుండా చదవడం, రాయడం విధిగా రావాలన్నారు. గణితంలో ఫండమెంటల్స్ నేర్పాలని సూచించారు. ఉర్లాంలో ఉపాధ్యాయుల బోధన, విద్యార్థుల అభ్యసన తీరు బాగుందన్నారు. డైట్ అధ్యాపకులు వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలతో జీవితాలు నాశనం



మాట్లాడుతున్న ఎస్‌ఐ సంధ్యారాణి

నరసన్నపేట: చెడు వ్యసనాలతో జీవితాలు నాశనమవుతాయని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో నరసన్నపేట ఎస్‌ఐ జె.సంధ్యారాణి సూచించారు. స్థానిక ఎల్‌వీఆర్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు బుధవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గంజాయి, కొకైన్ వంటి డ్రగ్స్ చాలా ప్రమాదకరమని అన్నారు. కొందరు యువకులు గంజాయి వినియోగిస్తున్నట్లు సమాచారం ఉందని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. డ్రగ్స్ రహిత రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం సూచనల మేరకు ప్రభుత్వ, ప్రైవేటు డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో ఇటువంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాదరావు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.4 లక్షల విరాళం



గ్రామస్తులకు నగదు అందజేస్తున్న త్రిలోచన్ పుల్లాయ్

పాతపట్నం: మండలంలోని బూరగాంలో నిర్మాణం చేపడుతున్న గ్రామ దేవత జడ్డమ్మ ఆలయానికి ఆ గ్రామ సర్పంచ్ బిజిలి పుల్లాయ్, ప్రహల్లాద పుల్లాయ్ కుటుంబ సభ్యులు రూ.4 లక్షల విరాళాన్ని అందజేశారు. గ్రామ పెద్ద విజయ బరోడా, గ్రామస్తులకు సర్పంచ్ కుమారుడు త్రిలోచన్ పుల్లాయ్ ఈ మొత్తాన్ని బుధవారం అందించారు. ఈ సందర్భంగా ప్రహల్లాద పుల్లాయ్ మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి అందరూ సహకరించాలన్నారు. రాబి పుల్లాయ్, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

జీడి, మామిడి తోటలపై..

పగ మంచు





పూత దశలో ఉన్న జీడి, మామిడి తోటలు

బూర్జ: పొగ, తేనె మంచు ప్రభావంతో పండ్ల తోటల రైతులకు అపార నష్టం వాటిల్లుతుందని మండల రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలో జీడి తోటలు 687 ఎకరాలు, మామిడి తోటలు 166 ఎకరాల్లో ఉన్నట్లు ఏఓ వి.రాజేశ్వరరావు తెలియజేశారు. ప్రస్తుతం పడుతున్న తేనె మంచుతో పూత పాడైపోయే ప్రమాదం ఉన్నందున తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. పూత దశలో పువ్వు రాలిపోకుండా ఉండటానికి సస్యరక్షణ చర్యలు చేపట్టాలన్నారు. పురుగు పోవడానికి పొటాషియం నైట్రేట్ నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు.

ఆధ్యాత్మిక భావాలు పెంపొందించుకోవాలి



ఆలయ వార్షికోత్సవ పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

- ఎమ్మెల్యే రెడ్డి శాంతి

ఎల్.ఎన్.పేట: ప్రజలు ఆధ్యాత్మిక భావాలు మరింత పెంపొందించుకోవాలని పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని మోదుగువలస (చిన్నకొల్లివలస) పునరావాస కాలనీలో బుధవారం జరిగిన ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు. శివపార్వతుల కల్యాణం, కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామస్తులందరూ ఐకమత్యంగా నిర్వహించుకునే పూజలు, ఆలయ వర్షికోత్సవాలు, ఆలయాల నిర్మాణాలు అందరినీ ఏకతాటిపై నడిపిస్తాయన్నారు. ఎంపీపీ రెడ్డి జ్యోతి లక్ష్మి, మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు, చిన్న కొల్లివలస సర్పంచ్ రెడ్డి రామారావు, పీఏసీఎస్ అధ్యక్షుడు కొల్ల రాము, సర్పంచ్‌లు గాది కోటేశ్వరరవు, యారబాటి గణపతి, వైఎస్సార్‌సీపీ నాయకులు రెడ్డి లక్ష్మణరావు, కొల్ల రాము, ముద్దాడ లక్ష్మణరావు, బలగ గోవిందరావు, లోచర్ల మల్లేశ్వరావు, ఎర్ర జనార్దన తదితరులు పాల్గొన్నారు.

280 మందికి వైద్య పరీక్షలు



మందులు పంపిణీ చేస్తున్న ధర్మాన కృష్ణచైతన్య

నరసన్నపేట: గ్రామాల్లో ప్రైవేట్ ఆస్పత్రి యాజమాన్యాలు వైద్య శిబిరాలు నిర్వహించాలని పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణచైతన్య కోరారు. మండలంలోని ఉర్లాం గ్రామంలో సర్పంచ్ పోలాకి నర్సింహామూర్తి ఆధ్వర్యంలో జెమ్స్ ఆస్పత్రి నిర్వహించిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రైవేట్ ఆస్పత్రులు సేవా కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ప్రధానంగా మారుమూల గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి రోగులకు ఉచిత సేవలు అందించాలన్నారు. 280 మందికి వైద్య పరీక్షలు చేపట్టారు. 18 మందికి ఆస్పత్రికి రిఫర్ చేశారు. రోగులకు ఉచితంగా మందులు సరఫరా చేశారు. వైద్యులు చమళ్ల ఫల్గుణ దీపక్, బెందాళం గౌతమి, ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉత్తమ బోధన



మానవహారం నిర్వహిస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మెరుగైన సౌకర్యాలు ఉన్నాయని ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రవికుమార్, వైస్ ప్రిన్సిపాల్ శాంతి హేమ్ అన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాధాన్యతను తెలియజేస్తూ బుధవారం పట్టణంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ, మానవహారం చేపట్టారు. శాంతి హేమ్ మాట్లాడుతూ డిగ్రీ కళాశాల గడిచిన మూడేళ్లలో ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. పలు కోర్సులతోపాటు ఎన్‌సీసీ, ఎన్‌ఎస్‌ఎస్ వంటివి అందుబాటులో ఉన్నాయన్నారు. డిజిటల్ కంప్యూటర్ తరగతులు, డిజిటల్ లైబ్రరీ ఉన్నాయని వివరించారు. ప్రధానంగా నిపుణులైన అధ్యాపకులు ఉన్నారని, విశాలమైన తరగతి గదులు ఉన్నాయన్నారు. విద్యార్థులు, తల్లిదండ్రులు గమనించి ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆదరించాలని కోరారు. గత వారం రోజులుగా పరిసరాల్లో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ప్రచారం చేపట్టామని వివరించారు.

భక్తితోనే మోక్షమార్గం



ప్రచార రథం ప్రారంభిస్తున్న కోరుకొండ శాంతారావు

నరసన్నపేట: భక్తితోనే మోక్షమార్గం కలుగుతుందని బ్రహ్మకుమారి బీకే బాలామణి అన్నారు. శివరాత్రి సందర్భంగా శివుడి విశిష్టతలను ప్రజలకు తెలియచేస్తూ ప్రజల్లో భక్తిభావాన్ని పెంచేందుకు స్థానిక బ్రహ్మకుమారీ సంస్థ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రచార రథాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బాలామణి మాట్లాడుతూ శివుడిని గొప్పతనాన్ని వివరించారు. శివుడిని పూజించడం ద్వారా మానసిక ప్రశాంతత పొందవచ్చన్నారు. దేశంలో ఉన్న జ్యోతిర్ లింగాల విశిష్టతను వివరించారు. శ్రీముఖలింగంలో పుణ్య స్నానాలు పూర్తయినంత వరకు గ్రామాల్లో ప్రత్యేక వాహనం ద్వారా ప్రచారం నిర్వహిస్తామని కమిటీ సభ్యుడు కోరుకొండ శాంతారావు అన్నారు. నరసన్నపేట, కోటబొమ్మాళి మండలాల్లో ప్రచారం చేపట్టామని తెలిపారు. బ్రహ్మకుమారీలు, కమిటీ సభ్యుడు తర్ర రామదాసు తదితరులు పాల్గొన్నారు.

సామూహిక కుంకుమ పూజలు



సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్న భక్తులు

ఎల్.ఎన్.పేట: మండలంలోని మోదుగువలస పునరావాస కాలనీలో సంతోషిమాత, ఉమా రామలింగేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నారు. బుధవారం పార్వతీ పరమేశ్వరుల కల్యాణం, సామూహిక కుంకుమ పూజలు చేపట్టారు. భక్తులకు అన్నప్రసాదాలను పంపిణీ చేశామని సర్పంచ్ రెడ్డి రామారావు చెప్పారు. మోదుగువలస పునరావాస కాలనీతో పాటు పరిసర గ్రామాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారి ప్రసాదం స్వీకరించారు.



అన్నసంతర్పణలో పాల్గొన్న భక్తులు